క్లుప్తంగా

పండగలు ఐకమత్యానికి ప్రతీక

అంబాజీపేట: ఐకమత్యానికి ప్రతీకగా సంక్రాంతి పండగ నిలుస్తుందని సర్పంచ్ మద్దింశెట్టి సుబ్బారావు (దొరబాబు), ఎంపీటీసీ వాకపల్లి కాశీ విశ్వనాథం (దొరబాబు) అన్నారు. విప్రో కంపెనీ ఆధ్వర్యంలో వాకలగరువు సచివాలయం ప్రాంగణంలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. సుమారు 70 మంది మహిళలు పాల్గొన్నారు.

సీఏలో పేద విద్యార్థి ఉత్తీర్ణత



నవీన్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ బ్రహ్మయ్య తదితరులు

మలికిపురం: గూడపల్లి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన పున్నం నవీన్ ఇటీవల విడుదలైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అక్కౌంటెంట్ ఆఫ్ ఇండియా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో తండ్రి పున్నం వెంకటేశ్వరరావు, తల్లి వీరవెంకటలక్ష్మి వారి కుమారుడు నవీన్‌కు స్వీట్లు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవీన్‌ను గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సుందర బ్రాహ్మయ్య, పంచాయతీ సెక్రటరీ బత్తుల వెంకటరమణ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు సత్కరించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

అంబాజీపేట: అనారోగ్య కారణంగా కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మాచవరానికి చెందిన మంచాల ఆదిలక్ష్మికి వలంటీర్ పులపర్తి గంగరాజు గురువారం రాత్రి వృద్ధాప్య పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ మట్టా పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు వలంటీర్‌ను అభినందించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



మామిడికుదురులో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న శ్రీరామ్

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన 25 మంది దివ్యాంగులకు గెయిల్ సీఎస్ఆర్ నిధులతో గురువారం బ్యాటరీతో నడిచే 25 ట్రై సైకిళ్లను అందజేశారు. జిల్లా దివ్యాంగుల సంస్థ అధికారి శ్రీరామ్ వీటిని పంపిణీ చేశారు. మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు ఒక్కొక్కరికీ రూ.50 వేల విలువైన వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ దివ్యాగులకు గెయిల్ తనవంతు సహకారం అందిస్తోందన్నారు. దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డాక్టర్ ప్రతాప్‌కు విశిష్ట సాహిత్య పురస్కారం



డాక్టర్ ప్రతాప్‌కు విశిష్ట సాహిత్య పురస్కారం అందజేస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

సఖినేటిపల్లి: రాజోలు దీవికి చెందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గురువారం ఏలూరులో ప్రభుత్వ సాహిత్య అకాడమీ తరఫున నిర్వహించిన సాహిత్య సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో విశిష్ట సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ వివరాలను ప్రతాప్ స్థానిక మీడియాకు తెలిపారు. ప్రముఖులు, సాహితీవేత్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. కళావేదిక ద్వారా చేసిన సాహిత్య సేవలకు గుర్తింపుగా ఈ విశిష్ట సాహిత్య పురస్కారం అందుకోవడం సంతోషకరంగా ఉందని డాక్టర్ ప్రతాప్ అన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆలమూరు: జొన్నాడ–యానాం రోడ్డులోని ఆలమూరు వద్ద జిల్లా సెబ్ టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించింది. తణుకు మండలం దువ్వకు చెందిన పి.వెంకట సీతారామయ్యను అరెస్టు చేసి, నాలుగు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. మండపేట మండలంలోని పాలతోడులో పి.రమేష్ నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడి చేసి, ఐదు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఎస్సై రాంబాబు తెలిపారు. అలాగే నర్సిపూడిలో సారా విక్రయిస్తున్న పి.గోవిందు ఇంటిపై ఆలమూరు పోలీసులు దాడి చేసి, ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

అవగాహనే ఔషధం

- కుష్ఠు రహిత సమాజానికి కృషి
- చురుగ్గా వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు
- అందుబాటులో బహుళ ఔషధ చికిత్స
- ప్రభుత్వ చొరవతో రోగుల సంఖ్య తగ్గుముఖం



జొన్నాడలో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ బృందం

ఆలమూరు: ఆరోగ్యమే మహాభాగ్యం. సాధారణంగా వంశ పారంపర్య కారణాలతో కానీ, ప్రకృతి ప్రభావితాంశాలతో కానీ మనుషుల్లో మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నం కావచ్చు. నేటి మానవ సమాజం శాస్త్రీయ అవగాహనతో సకాలంలో స్పందించి, తగిన చికిత్స తీసుకుంటే, ఎంతటి దీర్ఘకాలిక వ్యాధులనైనా నియంత్రించే శక్తి వైద్య రంగానికి ఉందనడంలో సందేహం లేదు. అలాంటి ప్రయత్నంలో భాగంగా కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కృషి చేస్తున్నాయి.

కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ బృందాలు ఇంటింటికీ తిరిగి, అనుమానితుల్లో వ్యాధి నిర్ధారణ చేపట్టారు. వ్యాధి లక్షణాలున్న వారికి అధునాతనమైన బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)ను అందిస్తూ, కుష్ఠు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా కృషి చేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలోని రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఉన్న 18 పీహెచ్‌సీల్లో గతేడాది నవంబర్ 16 నుంచి 30 వరకూ తొలి విడత సర్వే నిర్వహించారు. మళ్లీ గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 12 వరకూ మలి విడత కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య బృందాలు నిర్వహిస్తున్నాయి. ఈ పక్షోత్సవాల్లో భాగంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకూ 284 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులున్నట్టు అధికారులు గుర్తించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ప్రతి నెలా తొలి వారం కుష్ఠు వ్యాధి నివారణ బృందం వెళ్లి, రోగులకు ప్రత్యేక చికిత్సను అందిస్తూ త్వరితగతిన కోలుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

ఎండీటీతో వ్యాధి దూరం

మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ కుష్ఠు వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ ప్రదేశంలో వెంట్రుకలు రాలిపోతాయి. మచ్చలపై దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే, వెంటనే సమీపంలోని ఆశా, ఏఎన్ఎంలకు తెలపాలి. వ్యాధి నిర్ధారణైతే.. బహుళ ఔషధ చికిత్సను అందించడంతో పాటు, వ్యాధి తీవ్రత తగ్గే వరకూ రోగికి చికిత్సపరంగా అన్నివిధాలా సహకారం అందిస్తారు. వ్యాధిగ్రస్తులు మానసికంగా దృఢంగా ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తారు. పుండ్లు ఉన్నవారికి అవసరాన్ని బట్టి కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేస్తారు. చికిత్స సమయంలో రోగికి రూ.8 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు రూ.మూడు వేల పింఛను, నెలకు 35 కిలోల బియ్యం అందిస్తోంది.

ప్రత్యేక కార్యాచరణ



కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య, ఆరోగ్య బృందాలు ఇంటింటికీ వెళ్లి, వ్యాధి లక్షణాలను వివరిస్తున్న కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. చిన్నారుల శరీరాలను పరీక్షించి, మచ్చలుంటే సంబంధిత వైద్య నిపుణులకు నివేదిస్తున్నాం. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, డివిజన్ స్థాయిలో డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం పీహెచ్‌సీల్లో పర్యటిస్తూ, ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.
– డి.సాయికిషోర్, వైద్యాధికారి, పెదపళ్ల పీహెచ్‌సీ

అపోహలు వద్దు



కుష్ఠు వ్యాధిపై అపోహలు వీడాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి. పాఠశాలలు, క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నాం. కుష్ఠు వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదు. ప్రభుత్వం క్రమం తప్పకుండా సర్వే, చికిత్స, సాయాన్ని అందిస్తోంది.
– పి.రాధాకృష్ణ, సీహెచ్ఓ, పెదపళ్ల పీహెచ్‌సీ



సిరిపల్లి పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మమ్మ, ఎస్సై సురేష్‌బాబు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మామిడికుదురు: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు, గుండాట, జూదం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. మగటపల్లిలో గురువారం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మగటపల్లి, గోగన్నమఠం, కొమరాడ గ్రామాల్లో మైకు ప్రచారం చేశారు. నగరం ఎస్సై పి.సురేష్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలొద్దు

అంబాజీపేట: పండగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ స్పష్టం చేశారు. అంబాజీపేట సీఐ కార్యాలయంలో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఏటా నిర్వహించే ప్రభల తీర్థంలో అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. కోడిపందేల బరులను గుర్తించి, ధ్వంసం చేయాలన్నారు. ఎస్సైలు ఎ.చైతన్య కుమార్, హరికోటిశాస్త్రి, సురేష్ పాల్గొన్నారు.

రికార్డింగ్, అశ్లీల డ్యాన్సులకు అనుమతుల్లేవు

అయినవిల్లి: సంక్రాంతి సందర్భంగా రికార్డింగ్ డ్యాన్సులు, అశ్లీల నృత్యాలకు, అలాగే కోడిపందేలు, పేకాట, గుండాట, జూదాలకు ఎలాంటి అనుమతుల్లేవని తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మ, ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు. సిరిపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుడుపూడి శాంతావతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తహశీల్దార్, ఎస్సైలు ఆయా విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మద్యం సేవించి వివాదాలకు, అసాంఘిక కార్యక్రమాలను పాల్పడుతున్నారన్నారు. వారిని గ్రామ పెద్దలు గుర్తించి, పోలీసులకు అప్పగించాలని కోరారు. ఏవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంప్రదాయబద్ధంగా పండగ చేసుకోండి

సఖినేటిపల్లి: రానున్న సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా చేసుకోవాలని ఎస్సై ఎస్.రాము, తహసీల్దార్ వై.రామకుమారి అన్నారు. గురువారం కేశవదాసుపాలెంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. చట్ట ప్రకారం ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు.

చర్యలు తప్పవు

ఆత్రేయపురం: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బీవై కిరణ్‌కుమార్ హెచ్చరించారు. పేరవరం, తాడిపూడి, వసంతవాడ, ఆత్రేయపురం, ర్యాలి గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి, అరెస్టులు చేస్తామన్నారు. పలు గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. వారిని బైండోవర్ చేశామన్నారు.

డైరీ ఆవిష్కరణ



ఆలమూరులో డైరీని ఆవిష్కరిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

ఆలమూరు: ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరి ఫెడరేషన్ 2024 నూతన డైరీ ఆవిష్కరణ రువారం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ డాక్టర్ ఈదల శ్రీనివాసచౌదరి నేతృత్వంలో ఆలమూరులో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే వెంకట్రావు, తూర్పుగోదావరి జిల్లా అధికారి డాక్టర్ బి సత్య గోవింద్, కాకినాడ జిల్లా జేడీ డాక్టర్ కె సూర్య ప్రకాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని, డైరీని ఆవిష్కరించారు. ఏఎస్ఏహెచ్‌టీసీ డీడీ డాక్టర్ జి శ్రీనివాస్, ప్రతినిధులు మోటూరి రామారావు, బి.సాంబమూర్తి, కేవీ రామరాజు, ఎం.అక్కినాయుడు, ఎస్ వెంకటేశ్వరరావు, కొల్లి విజయబాబు, కె.శ్రీనివాస్, పి.రమేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సఖినేటిపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘం రూపొందించిన వాల్ క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్‌ను గురువారం అమరావతిలో పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ చేతుల మీదుగా ప్రతినిధులు ఆవిష్కరించారు. సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్, సంఘ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గుండేపల్లి ప్రభావతి స్థానిక మీడియాకు వివరాలు చెప్పారు. ప్రతి టీచర్ కష్టపడి మంచి నాణ్యమైన విద్యను అందించి, విద్యార్థుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకోవాలని ఆయన సూచించినట్టు ప్రభావతి తెలిపారు.

సమష్టి సహకారంతో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- పూజారిపాలెంలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం



పలివెల శివారులోని పూజారిపాలెంలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: శివారు గ్రామాలు సహా నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వ నిధులతోనే కాకుండా, వివిధ సంస్థల సహకారం కూడా తీసుకుంటున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పలివెల శివారు పూజారిపాలెంలో నెక్కంటి సీఫుడ్స్ యాజమాన్యం సహకారం రూ.7.50 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంట్‌ను, దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిధులు సుమారు రూ.2 లక్షలతో నిర్మించిన ప్లాంట్ షెడ్డును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. రూ.20 లక్షల ఎంపీ నిధులు, రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు గోరింకల డ్రైన్ పొంగి ప్రవహిస్తే ఈ గ్రామం ముంపునకు గురవుతోందన్నారు. ఇటీవల తుపాను సమయంలో అధికారులతో వచ్చి సహాయక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. పూజారిపాలెం గోరింకల డ్రైన్ నుంచి ఈతకోట–గన్నవరం రోడ్డు వరకూ బీటీ రోడ్డుకు రూ.60 లక్షలు, పూజారిపాలెం నుంచి దేవరపల్లి వరకూ బీటీ రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరు చేయించినట్టు వివరించారు. త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడ అత్యధిక ప్రజానీకానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేశామన్నారు. దాదాపు రోడ్లన్నీ ఆధునీకరించామని, మిగిలినవి కూడా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పొనుగుపాటి సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు తులా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



లూటుకుర్రులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ తాతకాపు, ఇతర నేతలు

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు అన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ఆవిష్కరించనున్న నేపథ్యంలో గురువారం లూటుకుర్రులో జన భాగీదారీ కార్యక్రమం జరిగింది. సెంటర్‌లోని విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. సామాజిక మహా శిల్పం పేరిట ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ, వితంతువులకు ‘సహృదయ’ సాయం



సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయం అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: స్వచ్ఛంద సంస్థలు సమాజానికి మెరుగైన సేవలు అందించాలని ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ పైడి రాజేష్ ఆధ్వర్యంలో యూఎస్ఏకి చెందిన ఏకం సంస్థ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగునికి ట్రై సైకిల్, ముగ్గురు వితంతువులకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ గత పదేళ్లుగా ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, సంస్థ సభ్యులు దిరుసుమర్తి సతీష్, యర్రంశెట్టి భాస్కర్, యర్రంశెట్టి సురేష్, బండారు సాయి, పైడి సురేష్, గాడి శ్రీను పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు



రావులపాలెం డిగ్రీ కాలేజీలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

రావులపాలెం: ముందస్తు సంక్రాంతి వేడుకలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్య ఆర్జేడీ చప్పిడి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రతిఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలన్నారు. ప్రతిఒక్కరికీ మంచి విద్య అందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణ, ఫుడ్ ఫెస్టివల్, మెహందీ తదితర పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరా ల్లో భాగంగా గంగిరెద్దులు, రంగవల్లులు, భోగిమంటలు, చక్కెర పొంగలి, సంప్రదాయ వస్త్రధారణ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బీహెచ్ సత్యమూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు బీపీఎస్ రెడ్డి, హరిబాబు, రమేష్‌బాబు, శ్రీనివాస్, సుభాషిణి పాల్గొన్నారు.

లక్కవరంలో రంగవల్లుల పోటీ



లక్కవరంలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ఇస్తున్న జెడ్పీటీసీ ప్రసన్నకుమారి

మలికిపురం: లక్కవరం కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు రంగవల్లులు, ఆటపాటలు, కోలాటం పోటీలు నిర్వహించారు. సర్పంచ్ కోట పుష్ప కుమారి అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, సద్గురు మురళీమోహన్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సందడి

మామిడికుదురు: మామిడికుదురులో ముందస్తు సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. భోగి మంటలు చుట్టూ తిరుగుతూ, పాటలు పాడారు. గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులు కోలాహలంగా సాగాయి. ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

గాలికుంటు నివారణకు టీకా తప్పనిసరి

ఆలమూరు: మూగ జీవాలకు సంక్రమించే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండి, పశు వైద్యుల సూచనలు పాటించడం ద్వారా మేలైన పశు గణాభివృద్ధిని సాధించవచ్చని ఆలమూరు పశు సంవర్ధక శాఖ ఏడీ డా.ఎల్.అనిత అన్నారు. ఆలమూరులోని ఏడీ కార్యాలయ ఆవరణలోని పశువుల ఆస్పత్రిలో గురువారం సర్పంచ్ నేలపూడి లావణ్యతో కలిసి గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఏడీ అనిత మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ఈ నెలాఖరు వరకూ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆలమూరు సబ్ డివిజన్‌లోని 19 పశువుల ఆస్పత్రుల పరిధిలో 20 వేల టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చూడి పశువులు, ఈనిన పశువులను తప్పించి, నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు విధిగా టీకా వేయించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రావులపాలెం: నడవలేని స్థితిలో ఉన్న ఓ మహిళకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న ఆమె కుటుంబ సభ్యులు స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. ఈ క్రమంలో గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తీర్లిక పద్మశ్రీకి వయస్సు రీత్యా రెండు మోకాళ్లు అరిగిపోయి, నడవలేని స్థితిలో ఉంది. వైద్యులు ఆపరేషన్ చెయ్యాలని సూచించారు. పద్మశ్రీకి భర్త, కొడుకులు లేరు. ప్రస్తుతం కూతురితో, రావులపాలెంలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. అల్లుడి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసంస్థ సభ్యులు ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విభాగం ఆధ్వర్యంలో మలికిపురంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ) సూచనలతో సెక్రటరీ డాక్టర్ పీఎస్ శర్మ ఆధ్వర్యంలో మలికిపురంలోని డాక్టర్ శేషాచలం ఆస్పత్రి ప్రాంగణంలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ జరిగింది. ఇందులో శిక్షణ పొందిన 43 మందికి గురువారం ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు బోనం రాజు, ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ప్రెసిడెంట్ రుద్రరాజు వెంకటరామరాజు, సెక్రటరీ ఏడిద వెంకటరామయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ‘ఆడుదాం ఆంధ్రా’



మాచవరంలో క్రీడా దుస్తులను ఆవిష్కరిస్తున్న సొసైటీ అధ్యక్షుడు, సర్పంచ్



ఆలమూరులో క్రికెట్ విజేత జట్టును అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

మామిడికుదురు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడల్లో భాగంగా గురువారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలుర, బాలికల విభాగాల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోగన్నమఠం–కరవాక గ్రామాలకు చెందిన జట్ల మధ్య జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో కరవాక జట్టు విజయం సాధించింది. రెండు రోజుల పాటు కబడ్డీ పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలస్థాయి పోటీలు మామిడికుదురు, లూటుకుర్రు, మొగలికుదురు జెడ్పీ హైస్కూళ్ల క్రీడా ప్రాంగణాల్లో ఈ నెల 20 వరకు జరుగుతాయని మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకావెంకన్నబాబు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల ప్రోత్సాహానికే..

అంబాజీపేట: ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా మాచవరం సచివాలయంలోని సిబ్బందికి క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా క్రీడా దుస్తులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి ముక్తేశ్వరం వైపీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్ పోటీలు జరిగాయి. విజేతలను ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య అభినందించారు.

ఆలమూరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో జొన్నాడ–1 గ్రామ సచివాలయం జట్టు ప్రథమ స్థానం సాధించగా, చెముడులంక–1 జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. నువ్వా నేనా అన్న రీతిలో కొనసాగిన కబడ్డీ పోటీల్లో చెముడులంక–1 గ్రామ సచివాలయం(ప్రథమ), బడుగువానిలంక (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నట్టు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు కట్టా శ్రీనివాసు, దూలం వెంకటలక్ష్మి విజేతలను అభినందించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

సఖినేటిపల్లి: పేదల ఆరోగ్యానికి నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా కేంద్రం భరోసా కల్పిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. గురువారం గొంది, మోరిపోడు గ్రామాల్లో ఎంపీడీఓ బడుగు మంగాదేవి వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. సర్పంచ్‌లు దొండపాటి రవికుమార్, ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఏపీఓ నాగప్రసాద్ పాల్గొన్నారు.

14న గోదాదేవి కల్యాణం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలో ఈ నెల 14న గోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.750 చెల్లించాలని ఈఓ తెలిపారు.

ఘనంగా చండీ హోమం

ఆలమూరు: చింతలూరులో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం వైభవంగా చండీహోమం జరిగింది. మార్గశిర అమావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.